నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

'చేసిన అభివృద్ధి మర్చిపోలేము'

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని చింతల్ సాంగ్వి గ్రామంలో ఐదు సంవత్సరాల నుండి గ్రామంపై ఎంతో చొరవ తీసుకొని అభివృద్ధి చేసిన పంచాయతీ కార్యదర్శి భీమ్‌సింగ్ ఇటీవల బదిలీ కావడంతో శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తను చేసిన ఐదు సంవత్సరాల సేవలను గుర్తు చేస్తూ బదిలీ కావడంతో కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ఆయనకు గ్రామ పెద్దలు, యువతీ యువకులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుంగన్న, మాజీ సర్పంచ్ ప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్, గ్రామ పటేల్ భీంమావు, ఆదివాసీ యూత్ అధ్యక్షుడు సుభాష్ పాల్గొన్నారు.



8 మంది తహసీల్దార్ల బదిలీ

నవతెలంగాణ - హాజీపూర్

జిల్లాలో 8 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హాజీపూర్ తహసీల్దార్ సతీష్ కుమార్‌ను కలెక్టర్ కార్యాలయం ఈ బ్లాక్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. హాజీపూర్‌కు నూతన తహసీల్దార్‌గా డి.శ్రీనివాస్‌రావు బదిలీపై రానున్నారు. జ్యోత్స్నను బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బదిలీ చేశారు. మంచిర్యాల తహసీల్దార్ రమేష్‌ను ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా నియమించారు. ఈయన స్థానంలో మంచిర్యాల తహసీల్దార్‌గా రఫతుల్ల హుస్సేన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. లక్షెట్టిపేట్ తహసీల్దార్ టి.శ్రీనివాస్‌రావును కలెక్టరేట్ ప్రోటోకాల్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈయన స్థానంలో దిలీప్‌కుమార్‌ను లక్షెట్టిపేట్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

ఇక పల్లె సందడి..!

- సర్పంచ్ ఎన్నికలకు సర్కారు పచ్చజెండా
- రిజర్వేషన్ల కేటాయింపుపైనే సర్వత్రా చర్చ
- పంచాయతీల్లో మొదలైన కోలాహలం
- సమరానికి సమాయత్తమవుతున్న ప్రధాన పార్టీలు
- ఉమ్మడి జిల్లాలో 1512 గ్రామ పంచాయతీలు

ఇక పల్లెల్లో ఎన్నికల సందడి మొదలుకానుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ముగియడంతో ఇక స్థానిక సంస్థల్లో కూడా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటుచేయాలని యోచిస్తోంది. వచ్చే నెల మొదటి వారంలో ఓటరు జాబితా పూర్తిచేయాలని స్పష్టం చేసింది. రిజర్వేషన్ల వివరాలను అందించాలని బీసీ కమిషన్‌కు సూచించింది. దీంతో సెప్టెంబర్ లేదంటే అక్టోబర్‌లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అప్పుడే పంచాయతీల్లో కోలాహలం మొదలైంది. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన నాటి నుంచి ఎదురుచూస్తున్న ఆశావహుల్లో తాజా కబురు ఉత్సాహం నింపుతోంది. ప్రధాన పార్టీలు సైతం పల్లె సమరంపై ప్రత్యేక దృష్టిసారించాయి. వీలైనన్ని ఎక్కువ పంచాయతీలు కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తి రేపుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, మంచిర్యాల

ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలుకానుంది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తొలుత సర్పంచ్ ఎన్నికలపై దృష్టిసారించింది. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసిపోవడంతో గత ఏడు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పాలకవర్గాలు లేకపోవడంతో నిధుల సమస్యతో పాటు పల్లెల అభివృద్ధిపై ప్రభావం పడుతోందనే ఉద్దేశంతో ప్రభుత్వం తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆగస్టులో ఈ ప్రక్రియ ప్రారంభించగా.. సెప్టెంబర్ లేదంటే అక్టోబర్‌లో ఎన్నికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1510 గ్రామ పంచాయతీలు ఉండగా 12,788 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

రిజర్వేషన్లపైనే ప్రధాన చర్చ

గత ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టం ద్వారా స్థానిక సంస్థల రిజర్వేషన్లు పదేండ్లకు పెంచింది. గత ఎన్నికల సందర్భంగా అనుసరించిన రిజర్వేషన్లే మరో ఐదేండ్లు కొనసాగుతాయని స్పష్టం చేసింది. కానీ తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడం.. కుల గణన చేపట్టిన జనాభా ప్రకారమే రిజర్వేషన్లు ఖరారు చేయాలని వివిధ వర్గాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. కానీ ప్రస్తుతం కుల గణన చేపడుతుందా..బీసీ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచి ఎన్నికలకు వెళ్తుందా అనేది ఇంకా స్పష్టత రావడం లేదు. తాజాగా ప్రభుత్వం సైతం బీసీ కమిషన్‌కు రిజర్వేషన్ల వివరాలు అందజేయాలని ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశం గ్రామాల్లోనూ ప్రధాన చర్చకు దారితీస్తోంది. ఇప్పుడున్న రిజర్వేషన్లే కొనసాగుతాయా..లేదంటే మార్పులు ఉంటాయా అనేది దానిపైనే సర్వత్రా ఆసక్తి రేపుతోంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న వారిలో ఇదే పెద్ద ప్రశ్నగా మారింది. రిజర్వేషన్ అనుకూలిస్తే వారు పోటీచేయడం.. మారిపోతే వారి దగ్గరి సంబంధీకులను పోటీ చేయించడం వంటి ప్రణాళికలు తయారుచేసుకుంటున్నారు. వాస్తవానికి పార్లమెంటు ఎన్నికలు ముగిసిన నాటి నుంచి సొంత ఊరి జనాల్లో పట్టు సాధించేందుకు ఆశావహులు అనేక రకాల ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తి రేపుతోంది. కాలనీల్లో తిరుగుతూ అందరితో మంచి పరిచయాలు ఏర్పరుచుకుంటున్నారు.

సమాయత్తమవుతున్న పార్టీలు..!

పార్లమెంటు ఎన్నికలు ముగిసిపోవడంతో ప్రధాన పార్టీలు పంచాయతీ ఎన్నికలపై దృష్టిసారిస్తున్నాయి. పార్టీ గుర్తులతో ఈ ఎన్నికలు జరగకపోయినా పరోక్షంగా ఆయా రాజకీయ పార్టీల ప్రభావం మాత్రం తప్పకుండా ఉంటుంది. గ్రామీణ స్థాయిలో ఆయా పార్టీల్లో కీలకంగా ఉండేవారినే అభ్యర్థులుగా ప్రకటిస్తుంటాయి. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల పథకాలతో పాటు తాజాగా తొలి విడత రుణమాఫీ చేయడంతో ఎక్కువ పంచాయతీల్లో విజయం సాధించి క్షేత్రస్థాయిలో మరింత పట్టుసాధించాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో నాలుగు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు గెలిచిన బీజేపీ సైతం అధిక పంచాయతీలు గెలుచుకొని సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క అధికారం కోల్పోయినా..గ్రామీణ స్థాయిలో కార్యకర్తల బలం ఉండటంతో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకొని పట్టునిలుపుకోవాలని బీఆర్‌ఎస్ భావిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది.

సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి పరిరక్షణకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) అధ్యక్షులు ఎస్.వెంకటస్వామి అన్నారు. శనివారం కెకె 5 గని కార్మికులను కలిసి బస్సు యాత్రను విజయవంతం చేయాలని కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 నుండి సింగరేణి పరిరక్షణ పేరుతో బస్సుయాత్ర బెల్లంపల్లిలో ప్రారంభమవుతుందన్నారు. ఇది అన్ని ఏరియాలలో తిరుగుతూ కొత్తగూడెంలో ముగుస్తుందన్నారు. బస్సు యాత్రలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రావణపల్లి బ్లాక్‌ను వేలం పాటలో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణికి భవిష్యత్తును పెంచేలా కొత్తగా గనుల కేటాయింపుతో పాటు కార్మికుల సమస్యలపై బస్సు యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల కార్మికులు, ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

దూరమైన ఆదివాసుల పింఛన్ కష్టాలు



నవతెలంగాణ-బేల

మండలంలోని మారుమూల ఆదివాసి గ్రామాలైన ఖార, వంజరిగూడ, గర్కగూడ గ్రామాల్లోని పింఛన్‌దార్లు పడుతున్న కష్టాలు కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి చొరవతో దూరమయ్యాయి. ప్రతినెల వీళ్లంతా సాత్నాల వాగు దాటి తోయిగూడ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లి పింఛను తెచ్చుకునే వారు. వర్షాకాలంలో సాత్నాల వాగు ప్రవహించడంతో 15 కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి పింఛన్ కోసం వచ్చేవారు. ఆయా గ్రామాల ప్రజలు సామ రూపేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. తపాల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి వాళ్ల గ్రామంలో పింఛన్ ఇప్పించేలా ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం ఖార గ్రామంలోనే పింఛన్ పంపిణీ ప్రారంభమైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సామ రూపేష్‌రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, గౌతంరెడ్డి, అవినాష్, అనిష్‌రెడ్డి ఉన్నారు.

ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా రోహిత్ దేశ్‌పాండే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా రోహిత్ దేశ్‌పాండే బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మాజీ ఎంపిటిసి గాధవేని మల్లేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, నాయకుడు వైరగడ ప్రతాప్ శాలువాతో సన్మానించారు. ఇప్పటివరకు ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా పని చేసిన శ్రీనివాస్ బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

ఆషాడ మాస సంబరాలు



నవతెలంగాణ-తిర్యాణి

మండలంలోని శ్రీ మేధ విద్యానికేతన్ పాఠశాలలో ఆషాఢ మాసంలో ప్రతి ఇంట నిర్వహించే గోరింటాకు కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరిస్తూ వారితో కలిసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సందీప్ మాట్లాడుతూ చిన్న వయసు నుంచే ప్రతి విద్యార్థికి ఆచార వ్యవహారాలతో పాటు ఆరోగ్యానికి ప్రకృతి ఎంత ముఖ్యమో తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

రిజర్వేషన్ పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీసీల రిజర్వేషన్ పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సమగ్ర కుల గణన సాధన యాత్రలో భాగంగా శనివారం పట్టణంలోని ఆర్‌ఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు బీసీలకు జరుగుతున్న అన్యాయం, కుల గణన అవశ్యకత గురించి వివరించారు. బీసీలను అన్యాయం, మోసం చేయడానికి యత్నిస్తే ఉరుకోమన్నారు. 136 కులాలున్న బీసీల సంఖ్య తేల్చకుండా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించొద్దన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుల గుణన చేపట్టి బీసీల లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. పిడికెడున్న అగ్రవర్ణాలు సీఎం, పీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కావాలి కానీ అధిక జనాభా ఉన్న బీసీలు కనీసం సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ కావద్దా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కుల గణన చేపడతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ 8 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించడం సరికాదన్నారు. ఎన్నో ఉద్యమాలు, పోరాట యోధులకు ఆదిలాబాద్ జిల్లా నిలయమని, ఇక్కడి నుంచే సామాజిక న్యాయం కోసం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్, మంచికట్ల ఆశమ్మ, నర్సాగౌడ్, అజయ్, మీసాల గణేష్, సత్యానారాయణ పాల్గొన్నారు

ఘనంగా ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి వేడుకలను బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి, అడ్వకేట్ జగన్మోహన్ మాట్లాడారు. చత్రపతి శివాజీ మహరాజ్ మనమడు చత్రపతి సాహూ మహరాజ్ రిజర్వేషన్‌ల పితామహుడు అని అన్నారు. 1894 నుంచి 1922 వరకు కొల్లాపూర్ సంస్థానాన్ని సంస్కరణలు చేసి పరిపాలించారని తెలిపారు. 1902లో కొల్లాపూర్ సంస్థానంలో 50శాతం రిజర్వేషన్లు ప్రకటించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్ల కొనసాగింపుగా రాజ్యాంగంలో డాక్టర్ అంబేద్కర్ నిమ్న స్థాయి వర్గాలకు, మహిలలకు రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. ఉచిత నిర్బంధ విద్యా, బాల్యవివాహాల రద్దు, వితంతు వివాహాలు జరిపించి ప్రత్యేక చట్టం తెచ్చారని, జోగిని, దేవదాసి చట్టాన్ని రద్దు చేశారని పేర్కొన్నారు. కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించి ఎన్నో సంస్కరణలు చేపట్టిన ఘనత చత్రపతి సాహుమహరాజ్‌దని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ ఎస్‌కె.లక్ష్మీ యాదవ్, నిర్మల్ నియోజకవర్గం నాయకులు సఫియాన్ సలీం, రాజేశ్వర్, బుజ్జమ్మ, కోమలి, గీత పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో అక్రమాల గుట్టురట్టు



నవతెలంగాణ-తలమడుగు

గ్రామీణ ఉపాధి హామీ చట్టం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. వివిధ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్లినప్పటికీ డబ్బులు రాకపోగా కొంతమంది కూలీలు పనులకు వెళ్లకుండా మస్టర్‌లో హాజరు గుర్తించినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. మండలంలో వందలాది చెట్లు నాటినప్పటికీ ఎనిమిది, తొమ్మిది మొక్కలే బతికున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. రికార్డులు, మస్టర్లు సరైన పద్ధతిలో లేకపోవడంతో ఏపీవో మేఘమాల, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. కార్యక్రమంలో అదనపు డిఆర్‌డిఓ కుటుంబరావు, కృష్ణారావు, ఎంపీడీవో శేఖర్, రమాకాంత్, ఎస్‌ఆర్పి రంజిత్, గీత, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సహించేది లేదు



నవతెలంగాణ-దండేపల్లి

తమ నాయకుడు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి అన్నారు. శనివారం మండలంలోని ముత్యంపేట గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులపై సామాజిక మధ్యమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌పై మండిపడ్డారు. కొర్విచెల్మలో పనులకు ఉపాధి హామీ ద్వారా మంజూరైన నిధులను కాంగ్రెస్ నాయకులు స్వాహా చేశారని అసత్య ప్రచారం చేయడంతో పాటు ఎమ్మెల్యేపై లేనిపోని అభండాలు వేస్తూ ఉద్దేశపూర్వకంగా ఆరోపణ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నారని, రైతాంగ సమస్యలు పరిష్కరిస్తూ విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. బిజెపి నాయకులు అసత్య ప్రచారాలు మనకపోతే తగిన బుద్ధి చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ రాకేష్ నాయకులు ముత్యాల శ్రీనివాస్, కొంగల నవీన్, ఆకుల దుర్గాప్రసాద్, ఆకుల రాజేందర్, వెంగళరావు, ముద్దసాని వేణు, వెంకటేష్, రమణ అంబటిపల్లి రవీందర్, బొప్పిడి మురళి, చుంచు నాగేష్ పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- తపాలా సబ్‌డివిజనల్ పర్యవేక్షణ అధికారి సందీప్‌కుమార్



నవతెలంగాణ-ఖానాపూర్

తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సబ్ డివిజన్ పర్యవేక్షణ అధికారి సందీప్ కుమార్ అన్నారు. మండలంలోని సుర్జాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తపాలా శాఖ ప్రవేశపెట్టిన పథకాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో తపాలా శాఖ గ్రామ ప్రజల కోసం అందిస్తున్న చిన్న మొత్తాల పొదుపు పథకాలు, రికరింగ్ డిపాజిట్, సేవింగ్ అకౌంట్స్, పిపిఫ్ అకౌంట్స్, టిడి అకౌంట్స్‌లలో చిన్న పెట్టుబడితో అధిక వడ్డీ అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల కోసం గ్రామీణ తపాలా జీవిత బీమా పథకం, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రొఫెషనల్ డిగ్రీ ఉన్నవారు తపాలా జీవిత బీమా పథకం పొందవచ్చని తెలిపారు. ఐపిపిబి ద్వారా జనరల్ ఇన్సురెన్స్ సంవత్సరానికి రూ.520 ప్రీమియంతో పది లక్షల బీమా, రూ.755 ప్రీమియంతో 15 లక్షల బీమా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఆకుల రాజమణి వెంకగౌడ్, సబ్ పోస్ట్ మాస్టర్ పి.నవీన్, సజన్‌సింగ్, మాజీ ఎంపీటీసీ జంగిలి సరితా శంకర్, గాజుల గంగన్న, జంగిలి నర్సయ్య, గాజుల శ్రీనివాస్, తపాలా సిబ్బంది మనీషా, చంద్రశేఖర్, యం.నర్సయ్య, నాగరాజు, రణధీర్, రాజన్న పాల్గొన్నారు.

టీఎస్ఆర్‌టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ ప్రారంభం

నవతెలంగాణ-నేరడిగొండ



మండలంలో టీఎస్ఆర్‌టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ శనివారం ప్రారంభమైంది. ఇప్పటి వరకు మండల వాసులకు కార్గో సేవలు లేక ఇబ్బంది పడేవారు. ఈ సేవలు అందుబాటులోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది సాయన్న, అబ్దుల్ అన్సార్, కిషోర్ కుమార్, గోసికంటి అమృత్ కుమార్, నేరడిగొండ కార్గో ఏజెంట్ సుద్దాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు రోజుల కింద మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన కుర్సెంగా సీతారాంకు చెందిన ఇల్లు కూలిపోయింది. దీంతోని ఇంట్లోని నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు ధ్వంసమయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న హైమన్ డార్ఫ్ ఎలిజిబెత్ గ్రంథాలయం



ముత్నూర్ గ్రామయూత్ ఆధ్వర్యంలో శనివారం నాగల్‌కొండ గ్రామంలోని గోండుగూడెంలో కుర్సెంగా సీతారాం కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ చైర్మెన్ దుర్వ సంతోష్, ఆత్రం లక్ష్మణ్, వెంకటేష్ గౌడ్, మెస్రం నెహ్రూ, మెస్రం విజయ్ కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తాంసీ

మండల కేంద్రానికి చెందిన కొట్రంగి గోదావరి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేసుకొని మందుల కోసం చేతిలో డబ్బులు లేకపోవడంతో ఆ పేద కుటుంబానికి తనవంతు సాయంగా గ్రామానికి చెందిన శివగణేష్ సిడ్స్ పెస్టిసైడ్ దుకాణ యజమాని జానకొండ శ్రీకాంత్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించి, తన ఉదారతను చాటుకున్నాడు. సాయం అందించిన శ్రీకాంత్‌ను బాధిత కుటుంబ సభ్యులతో పాటు మాలీ కులస్తులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



వానకాలం పంటల వివరాలు నమోదు



నవతెలంగాణ-లోకేశ్వరం

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి ఉమేష్ అన్నారు. శనివారం మండలంలోని రాజుర గ్రామంలో వానాకాలంలో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో రైతులు వేసిన పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. పంట వివరాలు నమోదు. చేసుకోకపోతే ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రానికి చెందిన జంగ్మే లక్ష్మణ్ అనే పూర్వ విద్యార్థికి ఇటీవల విడుదలైన ఎంజేపీ పీజీటీలో ఉద్యోగం సాధించాడు. శనివారం కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థి అయిన లక్ష్మణ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకొని మంచి ఉన్నత స్థాయికి ఎదిగి ప్రభుత్వ కార్యాలయంలో స్థానం కల్పించిందుకు అధ్యాపక బృందం ఎంతో సంతోషించారు. దీంతో కళాశాలలో చదువుకునే విద్యార్థులు లక్ష్మణ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిలో అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. దీంతో పాటు జనరల్ విభాగం హిందీలో జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం సంపత్ కుమార్, హన్మంత్‌రావు, భాస్కర్, శ్రీనివాస్, రమేష్, నర్సయ్య, శేఖర్, శివరాజ్, లింగయ్య, మాధవి విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని కమట్వాడ గ్రామానికి చెందిన తాంసి మాజీ జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఎంపీ గోడం నగేష్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానందం, నారాయణ, పలువురు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన వైద్యురాలు



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని ఆడ గ్రామంలో శనివారం పీహెచ్‌సీ వైద్యురాలు నైనత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, పిల్లలకు అందించే, పోషకాహారాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ 48 మంది రోగులకు స్క్రీనింగ్ చేసి మందులను పంపిణీ చేశామని, గర్భిణులకు పరీక్షలను నిర్వహించామని అన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించామని అన్నారు.

మహిళ ఆత్మహత్య.. ముగ్గురిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

వివాహిత ఆత్మహత్యకు కారణమైన ముగ్గురిపై కేసును నమోదు చేసినట్టు ఎస్సై దుబ్బాక సునీల్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ధనోర(బి)కి చెందిన జాతురే అనసూయ(20) ఆరెండ్ల కింద ఇంద్రవెల్లికి చెందిన జాతురే శివాజీ(24)తో వివాహం జరిగింది. ఇటీవల భర్త శివాజీ, మామ అంగత్, అత్తమ్మ దైవబాయి అదనపు కట్నం తేవాలని వేధించడంతో పాటు ప్రతి రోజు హింసిస్తుండే వాళ్ళు, అది భరించలేక ఆమె ఈ నెల 23న పురుగులమందు తాగి జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించిందని పేర్కొన్నారు. మృతురాలి తండ్రి సంపతే గోపినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గౌడ కులస్తుల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని ఆయా గ్రామాల గౌడ కులస్తులు మండల కేంద్రంలోని సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన గౌడ సంఘం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుందరగిరి ముత్తాగౌడ్, ఉపాధ్యక్షుడిగా గుడిపల్లి పవన్ గౌడ్, కార్యదర్శిగా ఎర్రోళ్ల స్వామిగౌడ్, సహాయ కార్యదర్శిగా కైరి సాగర్‌గౌడ్, కోశాధికారిగా నాగుల హరిగౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ కమిటీ 12 నెలలపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

రైతుల పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

- తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల ముందు చెప్పినట్లుగా వ్యవసాయ కూలీలకు, వరి పంట బోనస్‌కి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి, ఇది రైతుల ప్రభుత్వమని నిరూపించుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రైతులకు, వ్యవసాయంపై తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో 25శాతం వ్యవసాయానికి నిధులు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. 2024-25 వార్షిక బడ్జెట్ రూ.2,91,159 కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయశాఖకు రూ.72,659 కోట్లు, ఉద్యానవనానికి రూ.737 కోట్లు, సాగునీటి రంగానికి రూ.26కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.1,980 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.22,301కోట్లు కేటాయింపులు చేసి అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. గత ప్రభుత్వం వాస్తవానికి దూరంగా బడ్జెట్ కేటాయింపులు చేస్తూ, రైతులను ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. దేశంలోనే రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తున్న ఘనత కేవలం మన ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధి విధానాలతో రాష్ట్రంలో ఎన్నో ఆర్థికపరమైన అనేక ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టిందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇల్లు, ఎస్సీ,ఎస్టీ, బీసీల సంక్షేమానికి, విద్యా వైద్య రంగాలలో అభివృద్ధి చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ఇప్పటికే ఆరు గ్యారంటీల పథకాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు పది లక్షల రూపాయల వరకు ఆరోగ్యశ్రీ పెంపు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, తదితర సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుపేదలకు అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తడ్సెన వెంకట్‌రెడ్డి, మావల మండల్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కూనింటి దామోదర్‌రెడ్డి, నలిమేల నవీన్‌రెడ్డి, వేముల నాగరాజు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓకు ప్రత్యేక పరిపాలనాధికారాలు ఇవ్వాలి

- తుడుందెబ్బ డిమాండ్

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పీఓకు ప్రత్యేక పరిపాలనాధికారాలు ఇవ్వాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు అన్నారు. శనివారం ప్రెస్ భవన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు గిరిజనుల భూమి సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ పీఓకు గతంలో కల్పించిన ప్రత్యేక పరిపాలనాధికారాలు కొనసాగించాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ ఏజెన్సీ పరిధిలోని సివిల్ కేసులు ప్రాజెక్ట్ అధికారి వద్ద దావాలు ఫైల్ చేయుటకు అనుమతి కల్పించి, అట్టి కేసులు పరిష్కరించుటకు పీఓకు శాశ్వత అధికారాలు కల్పించేలా ప్రభుత్వం పరంగా తగిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ డిమాండ్ చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమాభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నాయని అన్నారు. గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడానికి 1970లో అప్పటి ప్రభుత్వం భూ బదలాయింపు నిషేధ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సుపరిపాలన అందించుటకు, ఆదివాసులు భూసమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వ ప్రతినిధిగా ఐటీడీఏ పీఓను ప్రత్యేకంగా నియమించి



ఏజెన్సీ ప్రాంత భూమి సమస్యలు పరిష్కరించే అధికారాలు కల్పించిందన్నారు. ప్రత్యేకించి ఏజెన్సీ భూమి సమస్యలు పరిష్కరించుటకు అధికారాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఐటీడీఏ ఏర్పాటు జరిగినప్పటినుండి ఈరోజు వరకు ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు అభివృద్ధితో పాటు సివిల్ వివాదాల పరిష్కారం కోసం ప్రాజెక్ట్ అధికారి వద్ద కేసులు పరిష్కరించు కుంటున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని సివిల్ కేసులు పరిష్కరించేందుకుగాను, 2002 సంవత్సరంలో ప్రభుత్వం అధికారాలు కల్పించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏజెన్సీ ప్రాంతాల్లోని సివిల్ కేసులు పీఓ వద్ద వేల కేసులు పరిష్కరించబడుతున్నాయని అన్నారు. కొంతమంది అవకాశవాదులు న్యాయస్థానాలను తప్పు పట్టించే విధంగా పీఓకు సివిల్ కేసులు పరిష్కరించే అధికారాలు లేవని ప్రకటించడం సరైంది కాదని అన్నారు. త్వరలోనే ఆదివాసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఐటీడీఏ పీఓకు ఉన్న అధికారాలను కాపాడాలంటూ కోరుతామన్నారు. అదేవిధంగా గతంలో ఉన్న ప్రభుత్వాలు అమలు చేసిన సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ ప్రతినిధులు కుడ్మెత తిరుపతి, సేడ్మకి సీతారామ్, ఆడ హనుమంతరావు, పెందూర్ ధర్ము, కుర్సెంగా అచ్యుత్‌రావు, కుమ్ర బాలేరావ్, కుమ్ర మనోజ్ పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి.. వాగు దాటి వైద్యమందించి..

- సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని మారుమూల గ్రామమైన గోపాల్‌పూర్‌కు వాగులు, వంకలు దాటుతూ వైద్య సిబ్బంది వైద్యమందించారు. శనివారం నవతెలంగాణలో ప్రచురితమైన విజృంభిస్తున్న జ్వరాలు అనే శీర్షికకు స్పందించిన వైద్యాధికారులు ఉదయం గోపాల్‌పూర్‌కు చేరుకొని, వైద్యమందించారు. పిట్టబొంగరం పీహెచ్‌సీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి వైద్యులు ప్రతాప్ నాయక్ ఆధ్వర్యంలో కన్నాపూర్ వరకు జీపులో వెళ్లగా అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల కాలినడకన వెళ్లుతూ, వాగును దాటుతూ వెళ్లి గోపాల్‌పూర్ చేరకొని వైద్యమందించారు. ఈ వైద్య శిబిరంలో 48మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో ఎనిమిది మందికి తీవ్ర జ్వరాలు ఉన్నట్టు గుర్తించి, వారినుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సిమెంట్ ట్యాంకులు, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రత వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు సోకుతాయని అవగాహన కల్పించారు. గ్రామస్తులు బావి నీటినే తాగుతున్నందున క్లోరినేషన్ చేసిన నీటినే వాడాలని, కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు పూజిత, హెచ్ఏ జలంధర్, గంగమ్మ, మాధవి, దివ్య, ఎల్లి సూర్యకల, విజయ్ కుమార్, శివ రంజని పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కుమార్



నవతెలంగాణ-ఇచ్చోడ

గ్రామపంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, ఐకేపీ సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.26వేలు వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.26వేలు వేతనాలు ఇచ్చి చిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగా భద్రతా కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, మండల కన్వీనర్ పవార్ జితేంధర్, కార్మికులు, నాయకులు అశోక్, సుభాష్ పాల్గొన్నారు.

నిండుకుండల చెరువులు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు తోపాటు వైకుంటాపూర్ ప్రాజెక్టు, అంబవాయి చేరువు, మోర్ చెరువు ఆలూరు పెద్దచెరువు ప్యారమూర్‌లోని పాపన్న చెరువు, ధని, జామ్ చెరువులు నిండుకుండలా మారాయి. ఇలాగే వర్షాలు పడితే పూర్తిగా నిండి అలుగులు పారే అవకాశం ఉంది. దీంతో చెరువు ఆయకట్టు పంట పొలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణ ప్రాజెక్టు నుంచి నీటి పారుదల అధికారులు కుడి, ఎడమ జౌలీ నాల నుంచి నీటిని విడుదల చేయడంతో కాలువల కింద వరి నాట్లు జోరందుకున్నాయి. కేజ్ వీల్ ట్రాక్టర్‌లకు బలే గిరాకీ పెరిగింది.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒక నయా పైసా కేటాయించకుండా అన్యాయం చేసిందని అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ విభజన హామీ చట్టం, 2014 కేవలం ఆంధ్రప్రదేశ్‌కే వర్తిస్తుందా, తెలంగాణకు వర్తించదా అని కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నించారు. తెలంగాణకు రావాల్సిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, మూసినది అభివృద్ధి, మెట్రో రైల్ విస్తరణ లాంటి అభివృద్ధికై బడ్జెట్‌లో ఎలాంటి స్థానం కల్పించకపోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రాజు యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ అబ్రార్, చెట్ల ఉమేష్, నాయకులు భోజన్న, అబుద్, మహమ్మద్, రహీముద్దీన్, షేక్ షాకీర్, హసీబ్, నారాయణ, చెట్లపల్లి అనిల్, కసిరే పోతన్న విజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-జైనథ్

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయున్ని మండలంలోని మండగడ గ్రామస్తులు శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బి.రమేష్, ఎ.స్వాతి, కే.రామకృష్ణ, బి.అరుణ, ఎండీ షాహెభాజ్‌లను గ్రామస్తులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు చేసిన సేవలను, విద్యార్థులకు పంచిన జ్ఞానాన్ని కొనియాడారు. అదేవిధంగా మండగడ పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ఎం.చంద్రమని, టి.అర్చన, సునందలను సన్మానించి, సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండగడ గ్రామస్తులు, యువకులు మామిడి మల్లారెడ్డి, ముక్కెర ప్రభాకర్, సిలిగం ఆశన్న, అక్నూర్ గణేష్, నర్ర విఠల్, ఎస్‌కే ఇరాజ్, ముదుపు ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శంభు గూడ గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల, వర్షాకాల వ్యాధులు, సంపూర్ణ పారిశుధ్యం, విద్య అవశ్యకతలపై శనివారం తెలంగాణ సాంస్కృతిక సారతి ఆదిలాబాద్ బృందం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, సారతి కళాకారుల టీమ్ లీడర్ చాకటి రవి, రాథోడ్ శంకర్, గోడం ఆశిష్, కుమ్ర నగేష్, ఆత్రం గోవింద్‌రావ్, గుంజలా రమేష్, గట్టు వెంకట్‌రావు, మెస్రం మురళి, రాజు, శ్రీలత, దుర్పత, నర్సమ్మ, రాలింగుతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా రొడ్డ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్‌గా రొడ్డ శ్రీనివాస్‌ను నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ప్రిన్సిపల్‌గా సుజాత ఉండగా ఆమె లాంగ్ లీవ్ పెట్టడంతో శ్రీనివాస్‌ను (ఎఫ్ఏసీ) ప్రిన్సిపల్‌గా నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించగా కళాశాల సూపరింటెండెంట్ అశోక్, సీనియర్ అసిస్టెంట్ స్వప్న, ప్రశాంత్, రాకేష్, నవీన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభకాంక్షలు తెలిపారు.

పార్డి(బి)లో సప్తమి వేడుకలు ప్రారంభం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈఏడాది కూడా సప్తమి వేడుకలు శనివారం శ్రీరాజరాజేశ్వర మందిరంలో ఆయాల పూజారి దత్తాత్రి మహరాజ్‌చే రాజరాజేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సప్తమి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.మోహన్ మాట్లాడుతూ పార్డి(బి) గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరుని ఆలయంలో పురాతన కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఆచారాన్ని కొనసాగించి, వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వేడుకలు వారం రోజుల పాటు కొనసాగి ప్రతి రోజు ఆర్య వైశులు అన్నదాన కార్యక్రమాలు చేసి చివరి రోజున గ్రామస్తులు అందరూ కలిసి కృష్ణుడి వేషధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమాలు చేపట్టి, ముంగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిమ్మన పోశెట్టి, శేరి సురేష్, బాబు, బిజ్జమ్ సంతోష్, అవుసలి లింబాద్రి, స్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

30న ఇందిరా పార్క్ వద్ద మౌనదీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 30న ఇందిరా పార్క్ దగ్గర చేపట్టే మౌన దీక్షను విజయవంతం చేయాలని పెన్షనర్ల జేఏసీ జిల్లా నాయకులు శశికాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిర ప్రారంభోత్సవానికి ప్రొఫెసర్ కోదండ రామ్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ప్రొఫెసర్ హరగోపాల్, పూర్ణచందర్‌రావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ దీక్షలో జిల్లాలోని పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జులై 28, 2024 | www.navatelangana.com

వేషధారణాలతో ఆకట్టుకున్న చిన్నారులు

• పాఠశాలలో బోనాల సందడి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని బోనాల వేడుకలను జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం పట్టణంలోని మాస్టర్ మైండ్ పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల అమ్మవారి, పోతురాజుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పాటల మీద చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సాయిని రవి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతిబింబంగా నిలుస్తుందని అన్నారు. పండుగల విశిష్టత విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్యేశంతో బోనాల పండుగ వేడుకలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాలలో సీట్ల సంఖ్యను పెంచాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు నియోజకవర్గంలోని బీసీ గురుకులాలలో సీట్ల సంఖ్యను పెంచాలని ఎమ్మెల్సీ దండె విఠల్ రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. శాసనమండలి సమావేశాల సందర్భంగా హైద్రాబాద్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్ మంత్రిని కలిసి సమస్యలు వివరించారు. గురుకులాలు, వసతిగృహాలలో సీట్ల సంఖ్య తక్కువగా ఉండడంతో పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ వెంట మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, మాజీ ఎంపీపీలు డుబ్బుల నానయ్య, బసార్కర్ విశ్వనాథ్‌లు ఉన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

• మున్సిపల్ కమిషనర్ భుజంగరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దస్నాపూర్‌లో కాలనీవాసులకు ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకం బాధ్యతగా తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ నుండి పంపిణీ చేసిన ప్రతి ఒక్క మొక్క బతికేలా చూడాల్సిన బాధ్యత కాలనీవాసులపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సంతోష్, వంశీ, ఉదయ్, కార్మికులు బాలేశ్, శంకర్ పాల్గొన్నారు.

రేపు గద్దర్ సంస్మరణ సభ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వచ్చే నెల 11న కాగజ్‌నగర్‌లో నిర్వహించే ప్రజా యుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, రిటైర్డ్ ఉద్యోగ ఐక్య సంఘాల వేదిక కన్వీనర్ అల్లి రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ ఉద్యోగుల సంఘ భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

'సకురా'కు ఆదర్శ విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ ఆసిఫాబాద్

జపాన్ ఉన్నత పాఠశాలలో సైన్స్ కార్యక్రమం 'సకురా'కు జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి అశోక్ వివరాలు తెలుపుతూ జపాన్ ఉన్నత పాఠశాల సైన్స్ కార్యక్రమం 'సకురా'కు జిల్లాలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా వారికి ఇంటర్వ్యూ నిర్వహించి ఆదర్శ పాఠశాల విద్యార్థిని హర్షిత రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు మంది విద్యార్థులను జపాన్‌లో నిర్వహించే కార్యక్రమానికి పంపించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక కావాలని సూచించారు. ఆదర్శ విద్యార్థినిని జిల్లా పరిషత్ పాఠశాల బాలురు ప్రధానోపాధ్యాయులు రాథోడ్ సుభాష్, సైన్స్ అధికారి కటకం మధుకర్, కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీపీఆర్ చేయడం వల్ల ఒక మనిషికి పునర్జన్మ ఇవ్వవచ్చని దానిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అడ ప్రథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినోద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. సీపీఆర్ చేయడం వల్ల 30 నుంచి 60 శాతం వరకు మనిషిని బ్రతికించవచ్చున్నారు. ఆక్సిజన్ అందకపోవడం వల్ల బ్రెయిన్ డెడ్ అయిపోతుందని పేషెంట్‌కు బ్రతికించడం కష్టమవుతుందని అయితే ఒక్కసారి సీపీఆర్ చేస్తే కొంతవరకు బతికించే ఛాన్స్ ఉంటుందన్నారు. సీపీఆర్ నిమిషానికి 100 నుండి 120 సార్లు చేయాలని నిమిషానికి రెండుసార్లు బ్రీతింగ్ ఇవ్వాలని ఇలా రెండు నిమిషాలలో ఐదుసార్లు సీపీఆర్ చేస్తే పేషంట్ బతకే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్ చేసే సమయంలో వెంటనే 108కి ఫోన్ చేయాలని, 108 వచ్చేంతవరకు సీపీఆర్ చేస్తూనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అధికారుల సహకారంతోనే అభివృద్ధి

నవతెలంగాణ-తిర్యాణి

అధికారుల సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నాడు. శనివారం నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా ముందుగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్రతి ప్రభుత్వాధికారి కలిసికట్టుగా పనిచేసి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుంచాలని అన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల పరంగా చేయాల్సిన పనులన్నీటిని 100శాతం పూర్తి చేయాలని, లేనియెడల ప్రతి ఒక్కరూ కలెక్టర్ కార్యాలయానికి హాజరై వివరణ ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏపీడీ రామకృష్ణ, మండల ప్రత్యేక అధికారి రమాదేవి, ఎంపీడీఓ వేముల మల్లేష్, వ్యవసాయాధికారి తిరుమలేశ్వర్‌రావుతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన

• ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య బోధన అందించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పనులు చేపట్టినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం మండలంలోని ధనోర ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సంయుక్తంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, తరగతి గదులు ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆస్పత్రి పరిసరాలు, వార్డులు, ఫార్మసీలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఎంపీడీఓ మహమ్మద్ అంజద్ పాషా, నోడల్ అధికారి ఆడే ప్రకాష్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర



• సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బొగ్గు బ్లాక్‌లు సింగరేణికి కేటాయించాలని, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర నిర్వహించనున్నట్లు ఈ యాత్ర మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే నేరుగా కేటాయించాలని, వేలం పాటను ఆపాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ యాత్ర ఎనిమిది రోజులపాటు కొనసాగనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థను నీరుగార్చి నిర్వీర్యం చేసే విధంగా వేలంపాట నిర్వహిస్తుందని అన్నారు. దీన్ని ప్రజలకు తెలియజేసేలా పరిరక్షణ యాత్ర కొనసాగుతుందన్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సింగరేణిలో 49 శాతం కేంద్రం, 51 శాతం రాష్ట్రం వాటా ఉందని, అయినప్పటికీ బొగ్గు గనులు ప్రయివేట్‌కు కేటాయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనితో సింగరేణి నష్టపోయి మూసివేసే ప్రమాదం ఉందన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపెల్లి బొగ్గు గనులు సింగరేణి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నం చేస్తే ప్రజలతో మమేకమై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి పరిరక్షణ యాత్రలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తిక్, ముంజం ఆనంద్ కుమార్, జె.రాజేందర్, నాయకులు మాలశ్రీ, టికానంద్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

• జిల్లా జడ్జి ఎంవీ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఆసిఫాబాద్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్‌తో కలిసి హాజరై ఖైదీలకు అవగాహన కల్పించారు. అంతకు ముందు జైలు ఆవరణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో ప్రశాంతమైన జీవనం గడపాలని అన్నారు. తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలి



• ఏఎస్పీ ప్రభాకర్ రావు

నవతెలంగాణ ఆసిఫాబాద్

ప్రజలకు పోలీసుల ఆధ్వర్యంలో అందించిన అత్యవసర ఫోన్ కాల్ 100, 112 నెంబర్లకు వచ్చేవాటికి వెంటనే స్పందించాలని ఆసిఫాబాద్ ఏఎస్పీ ప్రభాకర్ రావు తెలిపారు. జిల్లా కేంద్రాల్లోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో 100 టోల్ ఫ్రీ నెంబర్‌పైన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100, 112 నెంబర్లకు వచ్చే ఫోన్ కాల్‌లకు బ్లూ కోర్టు పెట్రో కార్ సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు. పోలీసుల మీద ప్రజలు ఎంతో నమ్మకంతో ఈ నెంబర్లకు ఫోన్ చేస్తారని ఆ నమ్మకాన్ని వమ్ము చేయకూడదన్నారు. మొబైల్ పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేస్తే వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి దానిని బ్లాక్ చేసి ఫిర్యాదు వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు పోయి అనవసర లింకులను ఓపెన్ చేయకూడదని, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతైతే, వెంటనే 1930కు కాల్ చేసి గాని, సైబర్ క్రైమ్ పోర్టల్ నందు గాని ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం దర్పన్ యాప్ గురించి కూడా వివరించి, తప్పిపోయిన పిల్లలు, ఆన్ నోన్ డెడ్ బాడీస్ అందులో అప్ లోడ్‌చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



కళాశాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు విరాళం

నవతెలంగాణ-వాంకిడి



మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాదంద్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు శుద్ధ మంచినీటిని సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు రెండు ఆర్వో ప్లాంట్లను విరాళంగా ఇస్తున్నట్లు ఆ ట్రస్టు ఆర్గనైజర్ సతీష్ తెలిపారు. వీటిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని, వారి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో కలుషిత నీరు తాగి విద్యార్థులు అనారోగ్యం పాలు కాకుండా ఉండాలనే ఉద్దేశంతో రెండు యూనిట్ల ఆర్వో ప్లాంట్లను అందజేశామన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌కుమార్ ట్రస్టు నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా..?



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి గుండి రోడ్డు గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదమయంగా మారింది. హైవే రహదారి నిర్మాణంతో బైపాస్ వెళ్లే బస్సులు కూడా ఇదే రహదారి గుండా వెళుతుండడం, రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో గుంతలు మయంగా మారి, నీళ్ల నిలిచి పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. 500 మీటర్ల రహదారి కూడా నిర్మించడంలో గత పాలకులు, ప్రస్తుత పాలకులు అధికారులు చొరవ తీసుకోకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలను తమ ఇండ్ల మధ్య నుండి వెళ్లకుండా చూడాలని గతంలోనే ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఇదే రహదారి గుండా భారీ వాహనాలు వెళ్లడం బురద మయంగా మారణంతో కనీసం నడిచే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేయాలని కాలనీవాసులతో పాటు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు



నవ తెలంగాణ-వాంకిడి

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపడుతోందని ఆ సంఘం మండల కార్యదర్శి దుర్గం అఖిల్ అన్నారు. శనివారం స్థానిక ఎస్ఐ చేతుల మీదుగా మాదకద్రవ్యాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందని, దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు నైపుణ్యం అవసరం, దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువతపై ఉందన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి ఆగస్టు 15 వరకు జిల్లాలో సదస్సులు, ర్యాలీలు, సంతకాలను సేకరణ గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకై యువతను మంచి దారిలో నడిపించేందుకు సాయశక్తుల ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల పాదయాత్ర



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రం నుంచి ఆసిఫాబాద్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ గతంలో వరంగల్‌లో చేసిన దీక్షకు మద్దతు పలికిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎనిమిది నెలలు పూర్తయినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో తమ సర్వీస్ రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, రెబ్బెన మండల సీఆర్పీలు మిట్ట దేవేందర్, మహేశ్వర, సత్యనారాయణ, రాజేశ్, జిల్లా నాయకులు గేడేకర్ సంతోష్, సోను, సందీప్, రాము, సుభాష్, పీటీఐలు రమేశ్, దెవన్న, రాజేష్ పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. స్థానిక జగ్జీవన్‌రాం చౌక్‌లో శనివారం కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, సంజీవ్ మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, పీఎఫ్, ఈఎస్ఐ కూడా తమ ఖాతాలో జమ చేయడం లేదని అన్నారు. అధికారులు స్పందించని పక్షంలో రాబోయే రోజులలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ కార్మికుని మృతదేహం

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు పత్తిపాక వెంకటేష్ మృతదేహం శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుకుంది. వెంకటేష్ గతంలో సౌదీ అరేబియాలో మూడు సంవత్సరాలు పనిచేసి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇదే సంవత్సరం మళ్లీ తిరిగి ఉపాధి నిమిత్తం వెళ్ళాడు. ఇదే క్రమంలో ఈ నెల 8న గుండెపోటు రావడంతో అక్కడే మరణించాడు. తోటి మిత్రులు, వెంకటేష్ పని చేసే కంపెనీ వారి సహాయంతో మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది. వెంకటేష్ పెద్ద కూతురు అంత్యక్రియలు నిర్వహించింది. కుటుంబానికి పెద్దదిగా ఉన్న వెంకటేష్ మరణించడంతో ఆ కుటుంబానికి తీరని లోటు మిగిల్చిందని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర అధ్యక్షుడికి ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ రాష్ట్ర ఆర్టిస్ట్స్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన తాళ్లపెల్లి రాజేశ్వర్‌ను లంబాడ హక్కుల పోరాట సమితి నాయకుడు బానోత్ రోహిదాస్ శనివారం జన్నారం ప్రెస్ క్లబ్‌లో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజేశ్వర్ ఆర్టిస్టుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం ఉత్తర తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి వారిలో చైతన్యం నింపారన్నారు. వారు మరింత ముందుకు సాగాలని వారి హక్కులను సాధించుకోవాలని కోరుతున్నామన్నారు.

అసెంబ్లీలో హామీలు ప్రస్తావించు.. నిధులు రాబట్టు..!

- సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ప్రదర్శించు
- అధ్యక్షా ఇది సామాన్యుడి ఎజెండా
- ఎమ్మెల్యేలలకు స్థానిక ప్రజల విన్నపం

నవతెలంగాణ-మంచిర్యాల

శాసనసభ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన నాయకులను నమ్మి ఓటు వేసి అధికారాన్ని కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం, పథకాల అమలు, నిధుల మంజూరుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయిన నేపథ్యంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ప్రజానీకానికి ఇచ్చిన హామీల అమలు కోసం శాసనసభలో ప్రస్తావించాలని డిమాండ్ చేస్తున్నారు.స్థానిక సమస్యలు, ఇచ్చిన హామీలు ప్రస్తావించూ.. పరిష్కారానికి నిధులు రాబట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కాఆరానికి ఎమ్మెల్యేలు ఈ అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు తీసుకురావాలని కోరుతున్నారు.

శ్రావణపల్లి గ్రామాన్ని కాపాడాలి

సంతోషం రమాదేవి, మాజీ ఎంపీపీ, నెన్నెల



బెల్లంపల్లి నియోజకవర్గంలోని శ్రావణపల్లి ఓసీని ప్రయివేట్ పరం చేస్తూ కేంద్రం ఇచ్చిన గ్రీన్ సిగ్నల్‌ను ఆపాలి. వందల ఎకరాల్లో రైతులు వ్యవసాయ భూములు కోల్పోతారు. గత 5 సంవత్సరాల నుంచి రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఈ మధ్యనే మామిడి తోటలు ఏపుగా పెరగడంతో అనేక మంది వాటిపై ఆధారపడి జీవిస్తున్నారు. శ్రావణపల్లి ఓసి ప్రయివేటు పరం కావడంతో అక్కడి గ్రామాలూ అయిన శ్రావణపల్లి, వెంకటాపురం గ్రామస్థుల రైతుల నోట్లో మట్టి కొట్టినట్టు అవుతుందని పలువురు భావిస్తున్నారు. 600 ఎకరాలు సాగు భూమిని కోల్పోయే అవకాశం ఉంది. ఆ గ్రామాన్ని కాపాడేలా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో ఐటి హబ్, నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో నిధులు తెస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నియోజక వర్గానికి జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు. కోనంపేట, కొత్తూరు గ్రామ ప్రజలకు పోడు భూములకు పట్టాలు అందించే విధంగా అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడాలని కోరుతున్నారు.

మంచినీటి సమస్య లేకుండా చూడాలి

పడాల మాధవి, మంచిర్యాల



మంచిర్యాల పట్టణంలో హమాలివాడ, అశోక్ రోడ్, అండర్ బ్రిడ్జి, సినిమావాడలో తాగు నీటి సమస్య పెద్ద ఎత్తున ఉంది. ఎండాకాలం వచ్చిందంటే తాగేందుకు నీళ్ల లేక అల్లాడుతున్నా.. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు ఇంటి ఇంటికి నల్ల నీరు అందిస్తామని తెలిపారు. చెప్పినట్లుగా మంచినీటి పథకం ప్రారంభించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో తాగు నీరు ప్రతి ఇంటికి చేరడం లేదు. పైపులు పగలడం, మోటార్ రిపేర్ అవడం లాంటివి నిత్యం జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మా సమస్యలు దృష్టిలో పెట్టుకొని ఎండాకాలంలో శాశ్వతంగా తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నాం.

కరకట్టల నిర్మాణం చేపట్టాలి

యశోద, ఎన్టీఆర్‌నగర్ మంచిర్యాల



వర్షాకాలం వచ్చిందంటే చాలు మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, రాంనగర్, ఎల్ఐసి కాలనీ కురిసిన వర్షాలకు జలమయమవుతాయి. వర్షాలు పడి వరద నీరు ఇండ్లలోకి చేరడం తో పునరావాస కేంద్రాలకు వెళ్లి తల దాచు కోవాల్సి వస్తుంది. గత 20 సంవత్సరాలుగా ఇవె సమస్యలు పునరావృతం అవుతున్నాయి. వర్షాలు తగ్గినాక వచ్చి వరదల వలన నష్టపోయిన కుటుంబాలను ప్రజా ప్రతినిధులు పలకరించి పోవడం, హామీలు ఇవ్వడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వాలు మారుతున్న మా బ్రతుకులు మారుతలేవు. ఇచ్చిన హామీ ప్రకారం కరకట్టల నిర్మాణానికి బడ్జెట్ ప్రాతి పాధించినప్పటికీ ఎస్టిమేషన్ కన్నా తక్కువ బడ్జెట్ కేటాయించారు. అట్టి బడ్జెట్‌తో కరకట్టల నిర్మాణం సాధ్యమేనా.. ఇప్పటికి అయినా అనుకున్న బడ్జెట్ కేటాయించి, ముంపు కాలనీలో నివసించే ప్రజలపై దృష్టి పెట్టి కరకట్టల నిర్మాణం చేపడితే ఎన్ని వరదలు వచ్చిన ఎటువంటి నష్టం జరగకుండా ఉంటుంది.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

తలాండి స్వామి, గ్రామం రాజారాం



ఊరు పుట్టినప్పటి నుండి మా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. గతంలో ఎంతో మంది నాయకులు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటికే ఎవరు ఇచ్చిన హామీని అమలు చేయలేదు. ఇప్పటికి మా గ్రామానికి ఆర్టీసీ బస్, అత్యవసర మైన సేవలు అందడం లేదు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మా గ్రామానికి రాక పోకలు కొనసాగించేందుకు మధ్యలో ఉన్న బ్రిడ్జి వర్షపు నీటితో నిండి పోయింది. దీంతో గ్రామస్తులకు వైద్య సదుపాయం కూడా అందలేని పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్న వెళ్లలేని పరిస్థితి. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల బహిష్కరణ చేస్తామని తెలుపుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టాం. మా గ్రామా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సీఎం దృష్టికి చేరేలా అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతున్నాం

కార్మికులను ఆదుకోవాలి

దుంపల రంజిత్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్‌లకు నెలకు రూ.18 వేల జీతం, ఆశా కార్యకర్తలకు రూ.18 వేల జీతం అమలు చేయాలి. మధ్యాహ్న భోజన పథకం కింద పని చేసే కార్మికులకు నెలకు రూ.10 వేల జీతం చెల్లించాలి. గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు సరిపడా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గుర్తించి కార్మికులను ఆదుకోవాలని అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు స్థానిక ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతున్నాం.

హామీలు నెరవేర్చాలి

దుర్గం సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు నేతకాని సంక్షేమ సంఘం



చెన్నూరు ఎమ్మెల్యే గెలిచిన 100 రోజుల్లో 40 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. నియోజకవర్గం లో ఇండస్ట్రీ నెలకొల్పి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. చెన్నూరు పట్టణం లో తాగునీటి సౌకర్యం, రోడ్లు, రవాణా సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన మాట ప్రకారం చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి అసెంబ్లీ సమావేశంలో మాట్లాడి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిధులు రావాలని కోరుతున్నాం. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెన్నూరు నియోజకవర్గంలోని పంటలు నష్ట పోయాయి. ప్రాణహిత వరద నీటితో ఎన్నో ఏండ్ల నుంచి పంటలు నష్టపోతున్నాయి. నష్టపోయిన పంటలను గతం లోను పరిహారం ఇస్తామని చెప్పి ఎటువంటి నష్టపరిహారం రైతులకు అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నుండి అయిన ప్రాణహిత వరద నీటిలో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించేలా చుడలని కోరుతున్నాం.

సింగరేణి సంస్థకు రక్షణ కల్పించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

సింగరేణి సంస్థను రక్షణ కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సింగరేణి సంస్థను కాపాడుకునేల అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేయాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి బొగ్గు బావుల పరిరక్షణ యాత్ర కరపత్రాలను స్థానిక బస్టాండ్ ఎదుట విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనులను వేలం వేస్తు, దేశ సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించబోతున్నదన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కూడా వేలంలో పెట్టిన బీజేపీ విధానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదనీ తెలిపారు. తెలంగాణలో బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం ఆపలని, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను ఈ నెల 29 నుండి ఆగస్టు 5 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ యాత్రలో వామపక్ష పార్టీలు, ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, సామజిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దుంపల రంజిత్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మహేష్, మోహన్ పాల్గొన్నారు.

విత్తన బంతుల తయారి అభినందనీయం



నవతెలంగాణ-నస్పూర్

విత్తన బంతులను తయారు చేయడం అభినందించదగ్గ విషయమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శనివారం సెంట్రల్ నర్సరీలో కార్మెల్ స్కూల్ విద్యార్థులు ఎకో క్లబ్ యాక్టివిటీస్‌లో భాగంగా జీఎం కార్యాలయంలోని నర్సరీలో విత్తన బంతులను తయారు చేసి వాటిని జీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే పర్యావరణ పరిరక్షణలో భాగం కావడం చాలా సంతోషకరమైన విషయమని వారు ఈ విత్తన బంతులను తయారు చేసి సింగరేణి సంస్థకు అందించడం అభినందించదగిన విషయమని, విద్యార్థులను ఇటువంటి మంచి కార్యక్రమాలు చేసే విధంగా ప్రోత్సహించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందనీయులని అన్నారు. ఇలా సేకరించిన విత్తన బంతులను శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న ఉపరితల గనుల ఓబి డంపులపైన చల్లడానికి ఉపయోగిస్తామని తెలిపారు. బంతులలో చింత, నేరేడు, పనస, వివిధ రకాల విత్తనాలు ఉన్నాయని సుమారు 5000 విత్తన బంతులను అందజేయడం చాలా సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ మేనేజర్ రమణారెడ్డి, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, కార్మెల్ స్కూల్ ఎకో క్లబ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని జన్నారం మాజీ జడ్పీటీసీ శనివారం మండలంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమములో రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యపై ఉన్న ఆసక్తితో జన్నారం మండల గ్రామీణ పిల్లలకి అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. చుట్టుపక్కల గ్రామాల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కరిమల జూనియర్ కళాశాల పనిచేస్తుందన్నారు. ఈ సదవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యా సంస్థల కరస్పాండెంట్ శ్రీ సంపత్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సతీష్ రాఘవేంద్ర విద్యా సంస్థల డీన్ హేమలత షిండే, రాఘవేంద్ర లిటిల్ హార్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జయరాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్ పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు



నవతెలంగాణ-తాండూర్

చెడు అలవాట్లకు బానిసలై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని బెల్లంపల్లి ఏసీబీ రవికుమార్ సూచించారు. శనివారం బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో గంజాయి, మాదక ద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే నష్టాలపై యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ మాట్లాడుతూ గంజాయి తదితర మధక ద్రవ్యాలవల్ల జరిగే అనర్థాల గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గంజాయి మాదక ద్రవ్యాలకు, సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా ఉండాలని సూచించారు. బెల్లంపల్లి పట్టణంలో ఎవరైనా గంజాయి అమ్మినా, పీల్చిన తమ దృష్టికి తేవాలని, గంజాయి మహమ్మారి నిర్మూలనలో అందరు తమ వంతుగా కృషిచేయాలని కోరారు. విద్యార్థిని, విద్యార్థులు భారత ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులందరు స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండాలని కాలేజీలో ర్యాగింగ్‌లకు పాల్పడవద్దని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ దేవయ్య పాల్గొన్నారు.

ఉప్పొంగుతున్న వాగులు

- కుందారం-కిష్టాపూర్ మధ్య రాకపోకలకు అంతరాయం

నవతెలంగాణ-జైపూర్



గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం రాత్రి నుండి శనివారం సాయంత్రం వరకు కురిసిన బారీ వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండల పరిధిలో శనివారం 27.5 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా శుక్రవారం 44.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా భీమారం మండల పరిధిలో శుక్రవారం 34.1 వర్షపాతం నమోదు కాగా శనివారం 28 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండగా భారీగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లో వరద నీరు వచ్చి చేరుతోంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కుందారం-కిష్టాపూర్ మధ్యన పెద్ద వాగు ఉప్పొంగి ప్రవహించడంతో కుందారం మీదుగా వేలాల, గోపాల్‌పూర్, పౌనూర్, శివ్వారం గ్రామాలకు వాహణాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా టేకుమట్ల శివారు రసూల్‌పల్లి లోలెవల్ వంతెనకు సరిపోనూ వరద ప్రవహిస్తుండగా వరద ఉధృతి ఏమాత్రం ఎక్కువైన వంతెన మీదుగా వరద ప్రవహించే అవకాశం ఉంది. వంతెన మీదుగా వరద ప్రవహిస్తే టేకుమట్ల మీదుగా షెట్‌పల్లి, నర్సింగాపూర్, బెజ్జాల గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది. తప్పనిసరి పరిస్థితుల్లో షెట్‌పల్లి, బెజ్జాల, నర్సింగాపూర్ గ్రామాలకు చెందిన వారు జైపూర్ పెగడపల్లి మీదుగా ప్రయాణించాల్సి వస్తుందని పరిసర గ్రామాల వారు పేర్కొంటున్నారు.

లాభాలు ప్రకటించి వాటా చెల్లించాలి




నవతెలంగాణ-నస్పూర్

గత ఆర్థిక సంవత్సరం సంస్థ సాధించిన లావాలను వెంటనే ప్రకటించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో ఉపాధ్యక్షుడు తోడే సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 35శాతం వాటాను చెల్లించాలన్నారు. సింగరేణి పరిరక్షణ కొరకు జులై 29 నుండి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ పేరుతో బస్సుయాత్ర బెల్లంపల్లి నుండి ప్రారంభం అవుతుందని ఇది అన్ని ఏరియాలో తిరుగుతూ కొత్తగూడెంలో ముగుస్తుందన్నారు. ఈ బస్సు యాత్ర 30వ తేదీ మంగళవారం రోజు శ్రీరాంపూర్‌లో ప్రయాణిస్తుందని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ అసెంబ్లీలో సింగరేణి భవిష్యత్తును కాపాడడానికి తెలంగాణలోని గనులను వేలంపాటలు లేకుండా సింగరేణికే కేటాయించేలా తీర్మానం చేసి ఏకవాక్యం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, సింగరేణికి రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, శైల శ్రీనివాస్, వేరుక సదానందం, మేల్లం శ్రీధర్, కొమ్ము ప్రవీణ్ పాల్గొన్నారు.

కాల్వలో పడిన జింక పిల్లను కాపాడిన అటవీ అధికారులు

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్ అభయారణ్యంలోని తాళ్లపేట రేంజ్ తపాల్‌పూర్ అటవీ సెక్షన్ పరిధిలోని 19వ డిస్ట్రిబ్యూటరీ కాల్వ నీటిలో ప్రమాదవశాత్తు జింక పిల్ల పడిపోయింది. కాలువలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకపోతు ప్రాణాపాయ స్థితిలో ఉన్న జింక పిల్లను శనివారం అటుగా వెళ్లిన తపాల్‌పూర్ అటవీ సెక్షన్, బీట్ ఆఫీసర్లు ఎస్కే నహీదపర్వీన్, ఎస్.లక్ష్మీపతి, బేస్ క్యాంపు వాచర్లు అక్కడికి వెళ్లి భారీ వర్షంలో నీటిలోకి దిగి జింకపిల్లను పట్టుకొని బయటకు తీశారు. ఆ తర్వాత పరీక్షించి హుషారుగా ఉందని గ్రహించి అడవిలో వదిలిపెట్టినట్టు, ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవి, మూగ, జంతువులపై ప్రేమ దయా కరుణ కలిగి ఉండాలని వారు సూచించారు. సెక్షన్ బీట్, బేస్క్యాంప్ సిబ్బందిని అభినందించారు.

యువతకు అన్యాయం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్



నవతెలంగాణ-మంచిర్యాల

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో యువతకు అన్యాయం జరిగిందని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) మంచిర్యాలజిల్లా నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతంపైగా ఉన్న యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించయాన్నారు. స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా, ఖేల్ ఇండియా నినాదాలు ఎటుపోయాయని వాటికి బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ హామీ ఎటు పోయిందని ప్రశ్నించారు. కనీసం ఉపాధి కోసమైనా బడ్జెట్లో నిధులు కేటాయించకుండా చేతులు దులుపు కున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారిడితో యువతను మోసం చేశారని అన్నారు. ఎన్నికలకు ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక హామీలు ఇచ్చి యువత ఓట్లు దండుకున్నాయని ఇప్పుడు యువతను విస్మరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్, పట్టణ కార్యదర్శి ఉప్పులేటి రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు తోటపల్లి ప్రదీప్, ఉపాధ్యక్షులు నీలాల రమేష్, వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.

13వ బెటాలియన్ కమాండెంట్‌గా వెంకటరాములు

నవతెలంగాణ-హాజీపూర్

గుడిపేట 13వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్‌గా అడిషనల్ కమాండెంట్ పి వెంకటరాములు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన 15వ బెటాలియన్‌లో సేవలందించి బదిలీలలో భాగంగా ఇక్కడికి అదనపు కమాండెంట్‌గా వచ్చారు. పటాలకు అధికారులు, యూనిట్ మెడికల్ ఆఫీసర్స్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

30న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి జూలై 30న కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశా వర్కర్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు శోభ, సమ్మక్క కోరారు. శనివారం బడ్జెట్ సమావేశాల్లో సమస్యలపై మాట్లాడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు, డీఎంఅండ్‌హెచ్‌ఓ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆశా వర్కర్లను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ ప్రభుత్వం అడుగుజాడల్లోనే నడుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పద్మ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-తలమడుగు



మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న అశోక్‌ను, కొత్తగా వచ్చిన కార్యదర్శి గజానన్ గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ నాయకులు, గ్రామస్తులు, అధికారులు అన్నివేళలా సహకరించారని తెలిపారు. కొత్తగా బదిలీపై వచ్చిన గజానన్‌కు కూడా గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు అభిరామిరెడ్డి, నాయకులు గంగన్న, ఆసం రవి, ఆనంద్, శ్రీకాంత్, అడెల్లు, సునీతారెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సయ్య, వెంకన్న పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో కాలనీలో పనులు



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని ఐదవ వార్డ్ పరిధిలో గల ఇంద్రనగర్ కరీం కాలనీలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానిక కౌన్సిలర్ పరిమిలత సురేష్ రూ.3000 సొంత ఖర్చులతో మొరం పోయించి బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేసి సమస్యను పరిష్కరించారు. భారీ వర్షాలకు ఆ కాలనీలో నీరు చేరి స్థానికులు నడవడానికి ఇబ్బందిగా మారడంతో కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కౌన్సిలర్ పనులు చేయించి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా చేశారు.

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది



నవతెలంగాణ-నిర్మల్

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకుంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని డిపియం శోభారాణి అన్నారు. శనివారం జిల్లా దివ్యాంగులకు తమ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఇటీవల కొత్తగా సదరం సర్టిఫికెట్స్ తీసుకున్న వాళ్లు ఎంపిడిఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏదైన సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గతంలో ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులు ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ వికలాంగుల సంఘాల నాయకులు సట్టి సాయన్న, ప్రవీణ్‌కుమార్, ఇసాక్ అలీ, ముత్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనులు చేయిస్తే చర్యలు



నవతెలంగాణ-ముధోల్

బాలకార్మికుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు మమత, పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో బాలకార్మికుల వ్యవస్థ నివారణ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దుకాణాలు, హోటళ్లలో బాలలతో పనులు చేయించొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాలర్, కానిస్టేబుల్ హరీశ్, అనుప్రియ ఉన్నారు.

తోయగూడలో వైద్య శిబిరం



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని కొలామా గ్రామపంచాయతీ పరిధిలోని తొయగూడలో శనివారం హెచ్‌ఈఓ పవార్ రవీందర్ వైద్య సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి రక్త పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మంగళవారం, శుక్రవారం గ్రామంలో డ్రైడే నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో హెచ్‌ఏలు బాపురావ్, సురేష్, వైద్య సిబ్బంది సంధ్య, అంగన్వాడీ టీచర్ విజయ, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా మారిన విద్యార్థుల భవిష్యత్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఫైనల్ సెమిస్టర్ పరీక్ష రాసినప్పటికీ వారు గైర్హాజరు అయినట్లు ఫలితాలలో చూపిస్తోందని, దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ప్రతినిధి తాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే 15 మంది విద్యార్థుల్లో ఒకరికి ఉన్నత చదువుల కోసం ఓ యూనివర్సిటీలో సీట్ వచ్చిందని కానీ ఫలితాల్లో ఆబ్సెంట్ ఉండడంతో చేరలేకపోతున్నారన్నారు. అధికారులు స్పందించి విద్యార్థులను న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు.

బోనమెత్తిన పాఠశాల విద్యార్థులు





నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని రబింద్ర పాఠశాలలో శనివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ప్లేస్కూల్ ఇన్‌చార్జ్ హేమలత మాట్లాడారు. మన తెలంగాణలో జరుపుకునే అతి ముఖ్యమైన పండుగలలో ఒకటి బోనాల పండుగని ఇది మన రాష్ట్ర పండుగ అని పేర్కొన్నారు. ఆషాడ మాసంలో బోనాల పండుగను రాష్ట్రం అంతటా చాలా ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్ మాట్లాడారు. బోనాలు ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించి, రైతులు తమ పాడి పంటలను క్రిమి కీటకాల బారినుంచి కాపాడి అలాగే తమ గ్రామాన్ని వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నుంచి కాపాడమని అమ్మవారికి బోనం సమర్పించి, మొక్కుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యదవ్, బీంరావ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్ : బోనాల పండగ వేడుకలను శనివారం మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు వివిధ వేషధారణతో బోనాల పండుగను వివరిస్తూ గ్రామంలో ఊరేగింపు చేశారు. మాజీ సర్పంచ్ బానోథ్ గజానంద్ నాయక్ పండగ విశేషాలను తిలకించి, పాఠశాల సిబ్బందిని అభినందించారు. తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రతిబింబంగా నిలుస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు డిగాంబర్, కోర్రల మహేందర్, చేతన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిలింద్, సిబ్బంది రాజు, భాగ్య పాల్గొన్నారు.

బోథ్ : సొనాల గ్రామంలో శనివారం వివేకానంద పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలు ఎత్తుకున్నారు. వివిధ రకాల పాటలపై నృత్యాలు చేశారు. విద్యార్థుల పోతురాజు వేషాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ శుద్ధోధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

కుభీర్ : మండలంలోని పల్సి గ్రామంలోని విద్యాభారతి పాఠశాలలో శనివారం ఆషాఢమాసం సందర్భంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బోనాలను నెత్తిన ఎత్తుకొని అమ్మావారికి బోనాల నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక నృత్యాలు, పోతరాజుల ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గంగాసింగ్ మాట్లాడుతూ తెలంగాణ అనగానే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది బోనాల పండుగ అని, ఈ పండుగకు చాలా ప్రాముఖ్యత ఉన్నదని పేర్కొన్నారు. అదే విధంగా రైతులు వేసిన పంటలకు వర్షాలు బాగా కురిసి వారు వేసిన పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని అన్నారు. బోనాల ఉత్సవాలు పట్టణంలోనే కాకుండా పల్లెల్లోనే, విదేశాల్లో సైతం వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోతన్న, ఉపాధ్యాయులు రామకృష్ణ, మధుసూదన్, సాయినాథ్, భోజన్న, రాజు, ప్రవీణ్, రాజు, దేవకి, కవిత, శ్రావణి, సరోజన, గంగామణి, సరస్వతి, వైష్ణవి, రాణి, అస్మిత, నేహ పాల్గొన్నారు.





రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందినట్టు మంచిర్యాల పట్టణ ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... సీసీసీ నస్పూర్‌కు చెందిన దొమ్మిడి వినయ్ కుమార్ అతని ద్విచక్ర వాహనంపై మందమర్రి నుంచి మంచిర్యాలకు వెళ్లే క్రమంలో గద్దె రాగడికి చెందిన గుర్రం రాజు(31) తల్లికి మందులు తేవడం కోసమని నడుచుకుంటూ మందుల షాప్‌కు వెళ్తూ రోడ్డు దాటే క్రమంలో వినయ్ కుమార్ అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొనడంతో గుర్రం రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్ కుమార్‌కు తీవ్ర గాయాలు అవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ యశోద హాస్పిటల్ కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతి చెందిన రాజు సోదరుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని యాదవ సంఘ భవనంలో ఏఐటీయూసీ రెండు రోజుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా నాయకులతో కలిసి సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం యాదవ సంఘ భవనంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై అనుబంధ కార్మిక సంఘాల నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు కోడ్లను తీసుకువచ్చిందన్నారు. మూడోసారి కూడా అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కార్మిక, ప్రజా వ్యతిరేక విదానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. వీటి గురించి సంఘాల బాధ్యులులకు తెలియజేసేలా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రజల కోసం అదాని, అంబానీల ఆస్తులను పెంచేలా పాలన సాగిస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలతో పాటు ప్రజల పక్షన ఉద్యమించడానికి ఏఐటీయూసీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజేంగుల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, చంద్రకళ, ఆశన్న, కేశవ్, భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

- గిరిజన ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు జాదవ్ సుమేష్



నవతెలంగాణ-ఉట్నూర్

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గిరిజన ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు జాదవ్ సుమేష్ అన్నారు. శనివారం మండలంలోని ఎక్స్ రోడ్డు గ్రామం నుంచి ఆసిఫాబాద్ వరకు వెళ్లే జాతీయ రహదారిని సందర్శించి, ఆయన మాట్లాడుతూ ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లే దారి అధ్వానంగా మారిందని అన్నారు. హస్నాపూర్ గ్రామం నుంచి అధికారులు, నాయకులు వెళ్లలేరని, చూసి చూడకుండా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై మండిపడ్డారు. ఎన్నో ప్రాణాలు పోయినా రోడ్డు గురించి పట్టించుకోరా అని అన్నారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. లేని పక్షంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-వేమనపల్లి

గర్భిణులకు సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. శనివారం వేమనపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల వేమనపల్లి మండలంలోని లోతట్టు గ్రామాలలో నీరు చేరి ప్రజల రాకపోకల ఇబ్బందుల దృష్ట్యా ప్రజలకు, గర్భిణులకు వైద్యపరమైన సమస్యలు ఏవి ఎదురు కాకుండా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ ఆరోగ్యాధికారి రాజారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాంశెట్టి బాపుతో కలిసి రాచర్ల గ్రామానికి వెళ్లే రహదారిపై నిలిచిన నీటి ప్రవాహాన్ని, అలాగే సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కల్లంపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిపైన చేరిన నీటి ప్రవాహాన్ని పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆశాలు ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రతి రోజు గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తూ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్‌లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ మనోహర్ తెలిపారు. శనివారం ఉట్నూర్ పోలీసులు, డిఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి భీముగూడ, అడ్డగూడ, నర్సాపూర్-జె గ్రామాలను సందర్శించారు. వర్షం కురుస్తున్న సమయంలో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని కోరారు. వర్షంలో విద్యుత్ స్తంభాలను ముట్టకూడదని, దెబ్బతిన్న ఇండ్లలో ఉండొద్దని తెలిపారు. గ్రామస్తులు వాగు దాటడానికి వాగుకు ఇరు వైపులా తాడు ఏర్పాటు చేశారు.

వేదం పాఠశాలలో పసుపు రంగు దినోత్సవం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో శనివారం పసుపురంగు దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. పిల్లలందరు పసుపురంగు దుస్తువులను ధరించి పసుపురంగు మామిడి పండు, నిమ్మ పండు, పసుపు మొదలగు వాటితో వచ్చే పోషకాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు పసుపురంగు దుస్తువులు ధరించి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారన్నారు. ఇలాంటివి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్, నాగభూషణం మెమోరియల్ హైస్కూల్, జిల్లా పరిషత్ స్కూల్‌లో శనివారం ప్రపంచ ప్రకృతి పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సామాజిక సేవకుడు జక్కుల వెంకటేష్ మొక్కలు నాటారు. నాటిన మొక్క సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్‌టీవీ ప్రసాద్, రాజేందర్‌గౌడ్, కిషోర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల మండలంలోని నాగపూర్ చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కందుకూరి రమేష్‌ని శనివారం ఎంపీ గోడం నగేష్ నాగపూర్‌లోని ఇంటికి వెళ్లి పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం ధైర్యంగా ఉండాలని తెలిపారు. బాధితుడిని పరామర్శించిన వారిలో లింగోజితండ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జాదవ్ హరినాయక్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొండారి రమేష్ ఉన్నారు.

పశువులను తరలిస్తున్న కంటైనర్ వాహనం పట్టివేత

నవతెలంగాణ-నేరడిగొండ



అక్రమంగా పశువులను తరలిస్తున్న కంటైనర్ వాహనాన్ని శనివారం పట్టుకున్నట్టు ఏఎస్సై మారుతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా కంటైనర్‌లో పశువులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా కంటైనర్ వాహనంలో 54 పశువులు ఉండటంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కి తరలించి, ఇద్దరు పెద్ద మనుషుల సమక్షంలో కంటైనర్ వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులు దానిష్, అజీమ్, షాహిద్, అసిఫ్, విరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా కంటైనర్ వాహనంలో ఉన్న 54 పశువులను ఇచ్చోడ గోశాలకు తరలించినట్టు తెలిపారు. కంటైనర్ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్టు తెలిపారు. ఏఎస్సై మారుతితో పాటు కానిస్టేబుళ్లు, శంకర్, దినేష్, కైలాస్ ఉన్నారు.